సాక్షి
ప్రకాశం
సోమవారం ၊ 16 ၊ అక్టోబర్ ၊ 2023



నేటి నుంచి ఈవీఎంల పరిశీలన

2024 సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించి ఫస్ట్ లెవెల్ చెకింగ్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

- 8లో..



క్రీడల్లో గెలుపోటములు సహజం

క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. ఓల్డ్ ప్రకాశం, ఓల్డ్ గుంటూరు జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ పోటీలను ఆయన ప్రారంభించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35.7/26.8

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. ఉక్కపోత అధికం. రాత్రిపూట చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

మిస్సైల్ మ్యాన్ కలాంకు ఘన నివాళి



కలాం విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు: మిస్సైల్ మ్యాన్‌గా ప్రపంచ మేధావుల ప్రశంసలు అందుకున్న మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహానికి స్థానిక శాసనసభ్యుడు బాలినేని శ్రీనివాసరెడ్డి, ఆయన కుమారుడు ప్రణీత్‌రెడ్డి ఆదివారం నివాళి అర్పించారు. ఏపీజే అబ్దుల్ కలాం జయంతి పురస్కరించుకుని స్థానిక కొణిజేడు బస్టాండు సెంటర్‌లో ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహ కమిటీ ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బాలినేని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు అనాథ పిల్లలకు ఏర్పాటు చేసిన అల్పాహార కార్యక్రమంతోపాటు దుప్పట్లను బాలినేని పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశం కోసం అబ్దుల్‌కలాం జరిపిన కృషి సామాన్యమైనది కాదన్నారు. ప్రపంచం మెచ్చిన శాస్త్రవేత్తగా పేరు ప్రఖ్యాతులు గడించినా, రాష్ట్రపతిగా ఉన్నా ఆయన నిరాడంబరమైన జీవితాన్నే గడిపారన్నారు. బాలినేని ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారా ఆయన జ్ఞానాన్ని పెంపొందించుకున్నారని వివరించారు. డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు, విగ్రహ కమిటీ నాయకులు షేక్ అజీజ్, చెన్నం శెట్టి శ్రీను, రెడ్డి కిరణ్, పఠాన్ రఫీ, గపూర్, జాకీర్, బూషా తదితరులు.. బాలినేనిని ఘనంగా సత్కరించారు.

మోడ్రన్ ధోబీఘాట్లు నిర్మించాలి



రజక వృత్తిదారుల సంఘం సభలో ప్రసంగిస్తున్న మున్నూరు భాస్కరయ్య

ఒంగోలు టౌన్: మారిన పరిస్థితులకు అనుగుణంగా రజకులకు మోడ్రన్ ధోబీ ఘాట్లు నిర్మించి ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రజక వృత్తిదారుల సంఘం ప్రధాన కార్యదర్శి మున్నూరు భాస్కరయ్య కోరారు. నగరంలోని ఎల్బీజీ భవన్‌లో ప్రకాశం జిల్లా రజక వృత్తిదారుల 6వ మహాసభలు ఆదివారం జరిగాయి. సభకు దేవారంపాటి వెంకటసుబ్బయ్య అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మున్నూరు ప్రసంగిస్తూ గ్రామాల్లో ధోబీ ఘాట్లు నిర్మించాలని, 50 ఏళ్లు దాటిన రజకులకు పెన్షన్లు ఇవ్వాలని, విశ్వకర్మ కౌసల్య పథకానికి 50 శాతం సబ్సిడీతో దరఖాస్తు చేసుకున్న వారందరికీ మంజూరు చేయాలని, ఖాళీగా ఉన్న ధోబీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. రజక సొసైటీలను పునరుద్ధరించాలని, బీసీ కులగణన చేపట్టాలని జేఎంపీఎస్ రాష్ట్ర నాయకులు తోట తిరుపతిరావు కోరారు.

రజక సంఘం నూతన కమిటీ ఎన్నిక...

ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా టంగుటూరి రాము, ప్రధాన కార్యదర్శిగా రాయల మాలకొండయ్య, ఉపాధ్యక్షునిగా రమణమ్మ, కోటేశ్వరరావు, ఆర్ఎల్‌పీ కృష్ణయ్య, సహాయ కార్యదర్శులుగా మంచికలపాటి శ్రీనివాసరావు, సీహెచ్ కొండయ్యలతో పాటుగా మరో 15 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

హాకీ జట్టు మేనేజర్‌గా మైనంపాడు పీఈటీ

చీమకుర్తి: ఏపీ పురుషుల హాకీ జట్టు మేనేజర్‌గా సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో పీఈటీగా పనిచేస్తున్న టి.రవికుమార్‌ను ప్రభుత్వం నియమించింది. ఈనెల 17 నుంచి 24 వరకు చెన్నైలో జరిగే సౌత్‌జోన్ హాకీ నేషనల్ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు మేనేజర్‌గా వ్యవహరించనున్నట్లు రవికుమార్ తెలిపారు.

ఆరోగ్య ప్రకాశం

ఒకప్పుడు కనీస వైద్యానికి నోచుకోని జిల్లా ప్రజల చెంతకు నేడు అత్యాధునిక వైద్యం అందుబాటులోకి వచ్చింది. జిల్లా కేంద్రంలో ఉన్న జీజీహెచ్‌తో పాటు మార్కాపురం జిల్లా వైద్యశాలలోనూ ఆధునిక వైద్య పరికరాలు, సేవలు అందిస్తున్నారు. రూ.475 కోట్లతో మార్కాపురం మెడికల్ కాలేజీ నిర్మాణం శరవేగంగా సాగుతుండగా, ఒంగోలు రిమ్స్‌లోనూ మరిన్ని సౌకర్యాలు సమకూరుస్తున్నారు.

- జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- ఒంగోలు రిమ్స్‌లో అత్యాధునిక వైద్యసేవలు
- నవజాత శిశువుల కోసం సిక్ నియోనేటల్ కేర్ యూనిట్
- మార్కాపురంలో శరవేగంగా మెడికల్ కాలేజీ నిర్మాణం
- తాజాగా కిడ్నీ రీసెర్చ్ సెంటర్ మంజూరు



ఒంగోలులోని జీజీహెచ్



రిమ్స్‌లో నవజాత శిశువుల చికిత్స కేంద్రం

ఒంగోలు టౌన్: ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చూపుతున్న శ్రద్ధతో జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం చేరువవుతోంది. నాడు జిల్లా కేంద్రంలో రిమ్స్, నేడు మార్కాపురంలో మెడికల్ కాలేజీ ఏర్పాటు వైఎస్ కుటుంబం అధికారంలో ఉన్నప్పుడే జరగడం ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. తాజాగా ప్రకాశం జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎం జగన్ అధికారులకు ఆదేశాలు ఇవ్వడం పట్ల ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వైద్యం కోసం పొరుగు జిల్లాలకు:

2004కు ముందు ప్రకాశం జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం అందని ద్రాక్షలా ఉండేది. సాధారణ వ్యాధులకు తప్ప అత్యవసర చికిత్స అవసరమైనప్పుడు పొరుగు జిల్లాలకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఉండేది. చంద్రబాబు పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైన వైద్య ఆరోగ్య రంగాన్ని గాడిలో పెట్టాల్సిన అవసరాన్ని గుర్తించిన మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వెనకబడిన ప్రకాశం జిల్లాపై దృష్టి సారించారు. ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో ఒంగోలులో రాజీవ్ గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్) ఏర్పాటుకు నిర్ణయం తీసుకున్నారు. ఒంగోలులో రూ.300 కోట్లు కేటాయించి 39 ఎకరాల్లో రిమ్స్ ఏర్పాటు చేశారు.

పేదలను పీడించిన చంద్రబాబు ప్రభుత్వం:

2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రజారోగ్యాన్ని గాలికొదిలేశారు. కార్పొరేట్ వైద్యానికి అండగా నిలిచి పేద, మధ్య తరగతి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారు. చంద్రబాబు పాలనలో ప్రాథమిక వైద్యశాలల్లో జ్వరం మందులు కూడా లేకుండా పోయాయి. ప్రభుత్వ వైద్యశాలల్లో పేదల నుంచి యూజర్ చార్జీలు వసూలు చేయాలని ప్రయత్నించారు. తీరా ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో తోకముడిచారు.

జగనన్న రాకతో మారిన పరిస్థితులు:

ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పేద, మధ్య తరగతి ప్రజలకు అత్యంత ఆధునిక వైద్యాన్ని అందించేందుకు అనేక నిర్ణయాలు తీసుకున్నారు. దీనికి తోడు ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని రిమ్స్ మీద పూర్తి స్థాయిగా దృష్టి సారించారు. 2019లో జీజీహెచ్‌గా మార్చి ప్రజలకు ఆధునిక వైద్య సౌకర్యాలను అందుబాటులోకి తెచ్చేందుకు తీవ్రంగా కృషి చేశారు. 500 బెడ్స్ కలిగిన జీజీహెచ్‌లో 100 బెడ్లతో ఐసీయూ కాంప్లెక్స్‌ను నిర్మించారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సివిల్ సర్జన్లు, జనరల్ ఫిజీషియన్లు నిరంతర వైద్య సేవలు అందిస్తున్నారు. 204 మంది రెగ్యులర్ నర్సులు, 171 మంది కంట్రాక్ట్ బేసిక్ నర్సులతో పాటుగా పెద్ద సంఖ్యలో పారా మెడికల్ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు.

- ట్రామాకేర్, క్యాజువాలిటీ, బ్లడ్ బ్యాంకు, ఐసీటీసీ సెంటర్, న్యూట్రీషియన్ రిహాబిలేషన్ సెంటర్‌లలో వందలాది మంది రోగులకు చికిత్సలు చేస్తున్నారు. థలసేమియా, హీమోఫీలియా వ్యాధులకు కూడా ఇక్కడ ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. హీమోఫీలియాతో బాధపడేవారికి ఫ్యాక్టర్ 8 అనే రూ.13 వేలకు పైగా ఖరీదు చేసే ఇంజక్షన్లను ఉచితంగా వేస్తున్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా డయాలసిస్ చేస్తున్నారు. కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ విభాగాలు అహర్నిశలు వైద్యం అందిస్తున్నాయి. సిటి స్కాన్, ఎంఆర్ఐలను జీజీహెచ్‌లో అందుబాటులోకి తీసుకొచ్చారు. ప్రస్తుతం జీజీహెచ్‌లో ప్రతిరోజు 1200 మంది వరకు ఔట్ పేషంట్లు చికిత్స కోసం వస్తున్నారు.

పసి పిల్లల కోసం ఎస్ఎన్‌సీయూ ఏర్పాటు:

నవజాత శిశువుల కోసం సిక్ నియోనేటల్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ) సౌకర్యం ఉన్నా మరిన్ని ఆధునిక సౌకర్యాలతో జీజీహెచ్‌లో కొత్తగా నిర్మించారు. ప్రస్తుతం నిర్మాణం పూర్తి చేసుకుంది. త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు.

మార్కాపురంలో వైద్యశాల నిర్మాణం:

పశ్చిమ ప్రకాశం జిల్లా ప్రజలకు మెరుగైన చికిత్సలు కోసం ఒంగోలు, గుంటూరు, హైదరాబాద్‌లకు వెళ్లాల్సి వస్తోంది. ప్రజల ఇబ్బందులను గమనించిన సీఎం జగన్ మార్కాపురంలోని రాయవరం వద్ద మెడికల్ కళాశాలను, అందుకు అనుబంధంగా వైద్యశాలను ఏర్పాటు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. మొత్తం 41.97 ఎకరాల్లో రూ.475 కోట్లతో వైద్యశాల నిర్మించేందుకు పునాదులు వేశారు. ప్రస్తుతం అఘమేఘాల మీద ఆస్పత్రి నిర్మాణం సాగుతోంది. ఈ ఆస్పత్రిలో 18 విభాగాలతో 500 పడకలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు. 6 ఐసీయూలు, 28 ఎమర్జెన్సీ పడకలు, 8 ల్యాబొరేటరీలు, 4 ఎక్సరే థియేటర్లతో పాటుగా సిటి స్కాన్, ఎంఆర్ఐ స్కానింగ్‌ల వంటి ఆధునిక వైద్య సౌకర్యాలు కూడా ఏర్పాటు చేయనున్నారు. 200 మందికి పైగా వైద్యులు, స్పెషలిస్టులను నియమించి నిత్యం వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వచ్చే ఏడాదికల్లా నిర్మాణాలు పూర్తి చేసి కళాశాలను ప్రారంభించేందుకు పనులు చేస్తున్నారు.

కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ఆదేశాలు:

ఇటీవల ప్రభుత్వం రాష్ట్రంలో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ అవసరమైన వైద్య సేవలు అందించే కార్యక్రమం ముమ్మరంగా చేస్తోంది. ఈ శిబిరాల్లో వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఈ పరీక్షల్లో పశ్చిమ ప్రకాశంలో ఎక్కువగా కిడ్నీ సమస్యలు కనిపించడాన్ని గమనించిన సీఎం జగన్ జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు ఆదేశాలు జారీ చేశారు. ఇది ఎవరూ ఊహించలేదు. ఎందుకంటే గతంలో ఉద్దానంలో ఇలాగే వందల సంఖ్యలో కిడ్నీ కేసులు వెలుగు చూసిన నేపథ్యంలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆ ప్రాంత ప్రజలు పోరాటాలు చేయాల్సి వచ్చింది. అయినా సరే టీడీపీ ప్రభుత్వం ససేమిరా అంటూ మొండికేసింది. జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అక్కడ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు ప్రకాశం జిల్లాలో ఎవరూ ఉద్యమాలు, పోరాటాలు చేయకుండానే స్వయంగా ముఖ్యమంత్రి కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేసేందుకు పూనుకోవడంతో అన్నీ వర్గాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




మార్కాపురంలో నిర్మాణంలో ఉన్న మెడికల్ వైద్యశాల



రిమ్స్‌లో ఏర్పాటు చేసిన ఐసీయూ

మంచి వైద్యం చేస్తున్నారు



ఒకరోజు పొద్దున్నే టీ తాగుదామని వెళుతుండగా అటుగా వెళ్తున్న వాహనం ఢీకొట్టింది. దాంతో నా కాలు విరిగింది. నన్ను ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయించారు. కానీ గాయం పూర్తిగా మానలేదు. ఇన్‌ఫెక్షన్ అయింది. ఇప్పుడు రిమ్స్‌కు వచ్చి చికిత్స చేయించుకుంటున్నాను. ఇక్కడ డాక్టర్లు చాలా బాగా వైద్యం చేస్తున్నారు. నా గాయం చాలా వరకు తగ్గింది. ఈ రోజు డిశ్చార్జి అయి ఇంటికి వెళ్తున్నాను.

– వెంకట రమణ, చీమకుర్తి

నా భర్త ప్రాణాలు రక్షించారు



మోటారు బైకు మీద నుంచి కిందకు పడడంతో నా భర్త చిన్న నాగయ్య తలకు తీవ్రమైన గాయమైంది. సీరియస్‌గా ఉండడంతో కంభం వైద్యులు ఒంగోలు రిమ్స్‌కు పంపించారు. ఇక్కడ తలకు ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడారు. ఉచితంగా వైద్యం అందిస్తున్నారు. ఇక్కడ డాక్టర్లు కానీ, నర్సులు కానీ మమ్మల్ని బాగా చూసుకుంటున్నారు.

- బుజ్జమ్మ, బొమ్మిలింగం గ్రామం, అర్ధవీడు మండలం

మాగుంట కుటుంబంపై ప్రత్యేక అభిమానం

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- ఘనంగా ఎంపీ మాగుంట జన్మదినోత్సవం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, అభిమానులు



ఎంపీ మాగుంట, ఎమ్మెల్యే బాలినేనిలను గజమాలతో సత్కరిస్తున్న అభిమానులు, పక్కన ఎమ్మెల్యే కరణం బలరాం, జంకె వెంకటరెడ్డి, మాగుంట రాఘవరెడ్డి తదితరులు

ఒంగోలు: జిల్లా వాసుల్లో మాగుంట కుటుంబంపై ప్రత్యేక అభిమానం ఉందని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి 70వ జన్మదినోత్సవం ఆదివారం స్థానిక రాంనగర్‌లోని ఆయన కార్యాలయంలో అభిమానుల ఆనందోత్సాహాలు, ప్రజల కోలాహలం మధ్య ఘనంగా నిర్వహించారు. ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డితోపాటు మాగుంట శ్రీనివాసులరెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డిల సమక్షంలో మాగుంట శ్రీనివాసులరెడ్డి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా బాలినేని శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 1991లో జిల్లాకు వచ్చిన మాగుంట కుటుంబం జిల్లా అభివృద్ధిలో విశేషంగా పాలుపంచుకుందన్నారు. వయస్సు పైబడుతున్నా మాగుంట ఇంకా ఉత్సాహంగానే కనిపిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో ఒంగోలు ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డి లేదా ఆయన కుమారుడు మాగుంట రాఘవరెడ్డి తప్పక పోటీ చేస్తారన్నారు. ఇందుకు తమ వంతు సంపూర్ణ సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. గత ఎన్నికల్లో మాగుంట శ్రీనివాసులరెడ్డి 2.20 లక్షల మెజార్టీతో గెలిచారని, ఈ దఫా ఎన్నికల్లో అంతకంటే ఎక్కువ మెజార్టీతో మాగుంట గెలుపు ఖాయం అన్నారు. చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి మాట్లాడుతూ అక్టోబరు 15 వచ్చిందంటే మాగుంట అభిమానులకు ఒక పెద్ద పండుగగా మారుతుందన్నారు. ప్రస్తుతం జిల్లాలో అభివృద్ధి పనులు బాగా జరుగుతున్నాయన్నారు. పైప్‌లైను పనులు పూర్తిచేయడంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోబట్టే నేడు ఒంగోలు నగరానికి తాగునీటి ఎద్దడి లేకుండా పోయిందన్నారు. ప్రస్తుతం సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల్లో 60 నుంచి 70 శాతం నీరు కూడా నిల్వ ఉండడం వారి ముందు చూపునకు నిదర్శనమని పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికల్లో ఒంగోలు శాసనసభ్యునిగా బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీగా మాగుంట శ్రీనివాసులరెడ్డి పోటీచేస్తారని వారిద్దరినీ గెలిపించుకునే బాధ్యత వైఎస్సార్‌సీపీ అభిమానులు, కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ తనకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్నా కార్యకర్తలు, ప్రజల అభిమానం సమస్యలను అధిగమించేలా చేశాయన్నారు. కొంత కాలం క్రితం తన కుమారుడు ఎదుర్కొన్న ఘటన తమకు చాలా ఆవేదన కలిగించిందని, ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ తమకు అండగా ఉండడంతోబాటు ఢిల్లీకి వచ్చి సైతం తమను ఓదార్చిన బాలినేని, కరణం బలరాంలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు, మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి, టీటీడీ ధర్మకర్తల మండలి సభ్యుడు శిద్దా సుధీర్, మాగుంట రాఘవరెడ్డి, బాలినేని ప్రణీత్‌రెడ్డి, మాగుంట నిఖిల్‌రెడ్డి, నగర మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీ బ్యాంకు చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు, వ్యవసాయ, మార్కెటింగ్ విభాగం ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, పీడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసు వెంకయ్య, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, ఏఎంసీ చైర్మన్ కొఠారి రామచంద్రరావు, ఒంగోలు డిప్యూటీ మేయర్లు వేమూరి సూర్యనారాయణ, వెలనాటి మాధవరావు, తాటిపర్తి చంద్రశేఖర్, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, పలువురు అధికారులు పాల్గొని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా దసరా
శరన్నవరాత్రి మహోత్సవాలు



పద్మవాహనంపై బాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో అమ్మవారు

- త్రిపురాంతకంలో పాల్గొన్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: శ్రీబాలా త్రిపురసుందరీదేవి, శ్రీపార్వతి సమేత త్రిపురాంతకేశ్వరస్వామి వారి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాల మధ్య ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి . రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ఉత్సవాల్లో పాల్గొన్నారు. ఉభయదాతల పూజలు, హోమాలు, బాలపూజ, సుహాసినిపూజ, కుంకుమార్చనలు భక్తులచే పండితులు నిర్వహించారు. శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆలయాల వద్ద భక్తులు అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరారు. అమ్మవారికి మంత్రి ఆదిమూలపు సురేష్ పట్టువస్త్రాలు అందజేశారు. అనంతరం ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయాల వద్ద పండితులు ప్రసాదశర్మ, విశ్వనారాయణశాస్త్రి, ఈఓ చెన్నకేశవరెడ్డి సాదర స్వాగతం పలికారు. ఎంఈఓ టీ రాజశేఖరరెడ్డి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, శ్రీశైలం ట్రస్ట్‌బోర్డు మాజీ డైరెక్టర్ ఇమ్మడిశెట్టి సుబ్బారావు, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ పద్మజ మల్లికార్జున్, సభ్యులు ఏ సుబ్బారావు, అన్నమ్మ లింగయ్య, నారాయణమ్మ సత్యనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ ఆళ్ల ఆంజనేయరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రంగబాబు, ఎస్ సుబ్బారావు, నక్కా చిన్నత్రిపురారెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంత్రి సురేష్

పద్మవాహనంపై బాలా త్రిపురసుందరీదేవి

శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా అమ్మవారు శ్రీబాలాత్రిపురసుందరీదేవి అలంకారంలో ఆదివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పల్లకీ సేవతో ఉత్సవాలు ప్రారంభం కాగా పద్మవాహన సేవ రాత్రి వైభవంగా జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సోమవారం రాత్రి బ్రహ్మచారిణి అలంకారంలో బాలాత్రిపురసుందరీదేవికి హంస వాహనసేవ జరగనుంది.




ప్రత్యేక అలంకారంలో బాలా త్రిపురసుందరీదేవి మూలవిరాట్



బాలాత్రిపురసుందరీదేవికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

వ్యవసాయంలో మహిళల పాత్ర ముఖ్యం

- ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగంలో మహిళలు చైతన్యవంతులు కావాలి
- జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి
- ఘనంగా జాతీయ మహిళా రైతు దినోత్సవం



మహిళా రైతులను సన్మానిస్తున్న రవీంద్రరెడ్డి, అన్నపూర్ణ, శ్రీనివాసరావు, రవి, సుజాత

కొత్తపట్నం: వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర ఉంటే వ్యవసాయం లాభసాటిగా ఉండటమే కాక ఆ కుటుంబం అన్ని విధాలుగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని జిల్లా అగ్రికల్చర్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ ఆళ్ల రవీంద్రరెడ్డి అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో జాతీయ మహిళా రైతు దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఏవో శేషమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా రవీంద్రరెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే అన్ని రంగాల్లో మహిళలే చైతన్యవంతులుగా ఎదిగారని, మిగిలిన మహిళా రైతులు కూడా నూరు శాతం చైతన్యవంతులు కావాలన్న ఉద్దేశంతో జాతీయ మహిళా రైతు దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలు ఇవ్వటం, ఇళ్లు నిర్మించడం, రైతు భరోసా ఇవ్వటం వంటివి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపాయన్నారు. పూర్తిగా రసాయన ఎరువులు వాడకం తగ్గించి ప్రకృతి వ్యవసాయం చేయాలని సూచించారు. ఆత్మ పీడీ అన్నపూర్ణ మాట్లాడుతూ ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మహిళలు ఇప్పటికే గుర్తింపు పొందారన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా వ్యవసాయం చేయాలన్నారు. వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో 70 శాతం మహిళలే ఉన్నారన్నారు. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో పురుషుల కంటే మహిళలు ఓపికగా పనిచేస్తున్నారని తెలిపారు. పశుపోషణలో 90 శాతం మహిళలే చేస్తున్నారన్నారు. డీఆర్‌డీఏ పీడీ టి.రవికుమార్ మాట్లాడుతూ పూర్వం నుంచి కూడా మహిళే వ్యవసాయంలో ముందున్నారన్నారు. ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత మాట్లాడుతూ డీఆర్‌డీఏ ద్వారా మహిళలను అన్ని రంగాల్లో చైతన్య వంతులు చేస్తున్నారని తెలిపారు. మహిళా రైతులు కోమట్ల భాగ్య లక్ష్మి, కాట యమున, తురకపల్లి దుర్గ శాలువలతో సన్మానించారు. మహిళా రైతులపై బద్దిపూడి ప్రేమానందనం పాట రూపంలో ఆలపించారు. అబ్దుల్ కలామ్ జయంతి సందర్భంగా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీవో డాక్టర్ పి.సుజాత, వ్యవసాయ శాఖ ఏవో మోహన్‌రెడ్డి, ఏపీఎం షేక్ రజియా సుల్తాన్ బేగం, సీసీలు రామారావు, నరసింహ, రెడ్డెప్ప, గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన రమణారెడ్డి

బేస్తవారిపేట: మండలంలోని పూసలపాడు బస్టాండ్ సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవే రోడ్డుపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పెంచికలపాడుకు చెందిన కందుల రమణారెడ్డి బేస్తవారిపేటలో సరుకులు కొనుగోలు చేసుకుని మోటార్‌సైకిల్‌పై వెళ్తున్నాడు. పూసలపాడు బస్టాండ్ వద్ద హైవేరోడ్డుపై వాహనాల వేగాన్ని నియంత్రించడానికి ఏర్పాటు చేసిన ఐరన్ డ్రమ్ములను మోటార్‌సైకిల్ ఢీకొట్టింది. ఈ సంఘటనలో రమణారెడ్డి తల రోడ్డుకు కొట్టుకోవడంతో తీవ్రంగా గాయపడ్డాడు. 108 సిబ్బంది క్షతగాత్రున్ని కంభం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ద్విచక్ర వాహనం చోరీ



బైక్ అపహరించి తీసుకెళ్తున్న యువకుడు

కంభం: ఇంటి ముందు నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనం అపహరణకు గురైన సంఘటన శనివారం రాత్రి కంభం పట్టణంలో చోటుచేసుకుంది. వివరాలు.. కందులాపురం రోడ్డులో తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న అత్తె మహేష్ తన బజాజ్ పల్సర్ బైక్‌ను రోజూ మాదిరిగానే ఇంటి ముందు పార్క్ చేశారు. తెల్లవారుజామున నిద్ర లేచి చూసే సరికి ఇంటి ముందు బైక్ కనబడలేదు. వెంటనే ఇంట్లో ఉన్న సీసీ కెమెరా పుటేజ్‌ను పరిశీలించగా అర్ధరాత్రి 12.45 నిమిషాల సమయంలో ఓ యువకుడు బైక్‌ను అపహరించుకెళ్తున్న దృశ్యం కనిపించింది.

కవయిత్రి స్వరూపరాణికి ఘన నివాళి



స్వరూపారాణి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళాభ్యుదయ సమితి సభ్యులు

ఒంగోలు మెట్రో: జిల్లాలో ప్రథమ స్త్రీవాద రచయిత్రి, పద్య కవయిత్రి కొలకలూరి స్వరూపరాణి ప్రథమ వర్ధంతి ఒంగోలులోని స్థానిక హౌసింగ్ బోర్డులో మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(న.ర.సం) ఆధ్వర్యంలో ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు మున్నంగి రాజకుమారి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న న.ర.సం రాష్ట్ర గౌరవ అధ్యక్షురాలు తేళ్లఅరుణ మాట్లాడుతూ.. ప్రకాశం జిల్లా గర్వించదగిన మొట్టమొదటి స్త్రీవాద రచయిత్రి స్వరూపారాణి అని పేర్కొన్నారు. ఎన్నో అవార్డులు సొంతం చేసుకుని రాష్ట్ర వ్యాప్తంగా ప్రకాశం జిల్లాకు ఘన కీర్తిని తెచ్చిపెట్టారని కొనియాడారు. ఆమె మృతి సాహిత్య లోకానికి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. న.ర.సం జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తి కృపావరం మాట్లాడుతూ.. స్వరూప కవయిత్రులను ఎంతగానో ప్రోత్సహించేవారన్నారు. తొలుత కొలకలూరి స్వరూపారాణి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కోశాధికారి బీరం అరుణ, జిల్లా ఉపాధ్యక్షురాలు మారేపల్లి సూర్యకుమారి, కె.శాంతి లత, గుంటూరు శ్రీదేవి, వేమా సుశీల పాల్గొన్నారు.

నడి రోడ్డుపై వానర యుద్ధం

కురిచేడు: సహజంగా వాటి చేష్టలతో వినోదం పంచే కోతులు.. ఇప్పుడు సామాన్య ప్రజలను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. స్థానికంగా ఉండే వందలాది కోతులు రెండు గ్రూపులుగా ఏర్పడి నిత్యం ఘర్షణలకు పాల్పడుతున్నాయి. తాజాగా ఆదివారం ఉదయం కొట్ల బజారులో సుమారు 60 కోతులు భీకరంగా అరుస్తూ యుద్ధ వాతావరణం సృష్టించాయి. వాటి ఆవేశాన్ని చూసిన ప్రజలు ఇళ్లలోకి పరుగులు తీశారు. సుమారు గంటసేపు ఆ బజారులో అల్లకల్లోలం రేపాయి. ఒంటరిగా వెళ్లే మహిళలు, చిన్నారులు, తలుపులు తీసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తున్నాయి. ఎంతో మంది వాటి దెబ్బకు గాయాలపాలవుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోకపోవటంతో పలువురు విమర్శిస్తున్నారు.



గ్రూపులుగా చేరి ఘర్షణ పడుతున్న కోతులు

నేటి నుంచి ఈవీఎంల పరిశీలన

- నవంబర్ 10వ తేదీ వరకు ఫస్ట్ లెవెల్ చెకింగ్
- ఈవీఎం గోడౌన్ల వద్ద పటిష్ట భద్రత
- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ మలికా గర్గ్



ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ నిర్వహణ ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఒంగోలు అర్బన్: 2024 సార్వత్రిక ఎన్నికల్లో వినియోగించనున్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించి ఫస్ట్ లెవెల్ చెకింగ్(ఎఫ్ఎల్‌సీ) సోమవారం నుంచి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఎస్పీ మలికాగర్గ్‌తో కలిసి స్థానిక మామిడిపాలెంలోని ఈవీఎంల గోడౌన్ వద్ద ఎఫ్ఎల్‌సీ నిర్వహణ ఏర్పాట్లు, బందోబస్తు, వెబ్‌కాస్టింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నెల 16వ తేదీ నుంచి నవంబర్ 10వ తేదీ వరకు ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందుకోసం ఎన్నికల కమిషన్ నియమించిన సాంకేతిక నిపుణులు వస్తున్నట్లు చెప్పారు. రోజూ ఉదయం 8 నుంచి రాత్రి 8 గంటల వరకు ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ కొనసాగుతుందని, ఈవీఎంలలో సాంకేతిక లోపాలను నిపుణులు పరిశీలిస్తారన్నారు. ఎఫ్ఎల్‌సీ పర్యవేక్షణకు జిల్లా రెవెన్యూ అధికారిని నోడల్ ఆఫీసర్‌గా నియమించినట్లు తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఎఫ్ఎల్‌సీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే ఆయా రాజకీయ పార్టీలకు లేఖలు పంపామన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను సీసీ కెమెరాలతో రికార్డు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ సీఈఓ, కలెక్టర్, ఎస్పీలు కూడా ఈ ప్రక్రియను లైవ్ వెబ్‌కాస్టింగ్ ద్వారా చూసేలా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఈవీఎం గోడౌన్ ప్రాంగణంలోకి రాకపోకలను నియంత్రించేలా పటిష్టమైన భద్రత ఏర్పాట్లు చేశామన్నారు. పూర్తిగా తనిఖీ చేసిన తర్వాత మాత్రమే గుర్తింపు కార్డులు ఉన్న వారిని ప్రాంగణంలోకి అనుమతిస్తారని స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించేది లేదన్నారు. ఎఫ్ఎల్‌సీలో పాల్గొనే సిబ్బందికి భోజన, ఇతర సౌకర్యాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతామన్నారు.

ఎస్పీ మలికాగర్గ్ మాట్లాడుతూ.. ఈవీఎం గోడౌన్ ప్రాంగణంలో ఆర్మ్‌డ్, సాధారణ పోలీసులతో పటిష్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విధుల నిర్వహణ కోసం ప్రాంగణంలోకి మహిళలు ప్రవేశించేటపుడు తనిఖీ చేసేందుకు మహిళా పోలీసులను నియమించామన్నారు. ఎఫ్ఎల్‌సీ దృష్ట్యా బయటి నుంచి ఎక్కువ మంది వచ్చే అవకాశం ఉన్నందున భద్రతాపరంగా ఎటువంటి లోపాలు తలెత్తకుండా సెక్యూరిటీని పెంచామన్నారు. సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధుల రాకపోకల సమయంలో పోలీసులు నిర్వహించాల్సిన విధులు, రికార్డుల నిర్వహణ తదితర అంశాలపై ఆదేశాలు జారీ చేశామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత, ఏఎస్పీ అశోక్‌బాబు, ఒంగోలు డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, ఎస్‌బీ డీఎస్పీ మరియదాసు, కలెక్టరేట్ ఏఓ చిరంజీవి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాసరావు ఇతర అధికారులు పాల్గొన్నారు.

భార్యను కడతేర్చిన భర్త

- బైక్‌తో సహా కాలువలోకి నెట్టి.. ఊపిరాడకుండా చేసి చంపిన వైనం
- ప్రమాదంగా చిత్రీకరించేందుకు ప్రయత్నం
- కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో బయటపడిన నిజం



నీటిలో తేలియాడుతున్న కోటేశ్వరి మృతదేహం



కోటేశ్వరి(ఫైల్)

పుల్లలచెరువు: మనస్పర్థల నేపథ్యంలో ఓ యువకుడు క్షణికావేశానికి లోనై కట్టుకున్న భార్యను కడతేర్చాడు. సాగర్ కాలువలోకి బైక్‌తో సహా భార్యను నెట్టి నీటిలో ముంచి హత్య చేశాడు. ఎవరికీ అనుమానం రాకుండా ప్రమాదకర సంఘటనగా చిత్రీకరించాడు. ఈ సంఘటన పుల్లలచెరువు మండలంలోని మానేపల్లి వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకోగా.. మృతదేహాన్ని ఆదివారం గుర్తించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన పూజల శ్రీను, కోటేశ్వరి(28) దంపతులు అనుపత్రికి వెళ్లి వస్తామని చెప్పి పిల్లలను ఇంటి వద్దే ఉంచి బైక్‌పై మేడపికి బయలుదేరారు. ఆస్పత్రిలో వైద్యం చేయించుకున్న తర్వాత తిరుగుప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సిద్ధన్నపాలెం, మానేపల్లి, ఐటీవరం గ్రామాల వద్ద భార్యతో శ్రీను గొడవపడుతుండగా స్థానికులు వారించారు. అయితే మానేపల్లి వద్ద కాలువ కట్టపైకి రాగానే భార్య కోటేశ్వరితోపాటు తన ద్విచక్రవాహనాన్ని శ్రీను కాలువలోకి నెట్టాడు. భార్యకు ఊపిరాడకుండా నీటిలో ముంచి ప్రాణం పోయిందని నిర్ధారించుకున్నాక తాపీగా బయటకొచ్చాడు. ప్రమాదం జరిగిందని అందరినీ నమ్మించేందుకు ప్రయత్నించాడు. కోటేశ్వరి కుటుంబ సభ్యులకు అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు నిజం వెలుగులోకి వచ్చింది. శనివారం గల్లంతైన మహిళ మృతదేహాన్ని త్రిపురాంతకం మండలంలోని విశ్వనాథపురం సమీపంలో లాకుల వద్ద ఆదివారం గుర్తించారు. సంఘటనా స్థలాన్ని ఎస్సై కోటయ్య పరిశీలించారు. కుటుంబ సభ్యుల సహాయంతో మహిళ మృతదేహాన్ని బయటకు తీశారు. కేసును సీఐ మారుతీకృష్ణ దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వైపాలెం తరలించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

వైద్య సేవలు అభినందనీయం



మట్టిగుంటలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి

నాగులుప్పలపాడు: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్యం కోసం వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. మట్టిగుంటలో వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు దారా పద్మజ ఆధ్వర్యంలో దారా అంకయ్య 40వ వర్ధంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని బాలినేని ప్రారంభించారు. తొలుత అంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. బాలినేని మాట్లాడుతూ.. చైతన్యం కలిగిన గ్రామం మట్టిగుంట అని ఇక్కడ నుంచి దారా సాంబయ్య, పాలపర్తి డేవిడ్‌రాజు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారన్నారు. రానున్న ఎన్నికల్లో సమష్టి కృషితో సంతనూతలపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగరవేయడానికి కృషి చేయాలన్నారు. దారా పద్మజ మాట్లాడుతూ.. తమ తాత అంకయ్య సేవా స్ఫూర్తిని కొనసాగిస్తామని చెప్పారు. ముందుగా నాయకుల కోరిక మేరకు ఉప్పుగుండూరు పోలేరమ్మ తల్లి ఆలయంలో బాలినేని ప్రత్యేక పూజలు చేశారు. మట్టిగుంటలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. మనం మన ఊరు మన ఈదుమూడి సంస్థ ఆధ్వర్యంలో ఒంగోలు శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో కావూరి వాసు సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. మొత్తం 200 మందికి వైద్య సేవలు అందించినట్లు డాక్టర్ దావల వంశీకృష్ణ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యేలు దారా సాంబయ్య, పాలపర్తి డేవిడ్‌రాజు, ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వైద్య విభాగం స్పెషల్ ఆఫీసర్ యాదాల అశోక్ బాబు, చీమకుర్తి, త్రిపురాంతకం జెడ్పీటీసీలు వేమా శ్రీనివాసరావు, జాన్‌పాల్ పాల్గొన్నారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

- ప్రతి ఒక్కరూ చేతుల శుభ్రతపై దృష్టి సారించాలి
- జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి



వల్లూరులో చేతుల శుభ్రత ప్రాధాన్యతను వివరిస్తున్న డీపీఓ నారాయణరెడ్డి

టంగుటూరు: సమాజంలో ప్రతి ఒక్కరూ చేతుల పరిశుభ్రతపై దృష్టిసారించి ఆరోగ్యం మన చేతుల్లోనే ఉందన్న వాస్తవాన్ని గ్రహించాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం జిల్లాలోని అన్ని పంచాయతీల్లో వరల్డ్ హ్యాండ్ వాషింగ్ డే కార్యక్రమాలు నిర్వహించారు. టంగుటూరు మండలంలోని వల్లూరు పంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో డీపీఓ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. చేతుల శుభ్రతతో కలిగే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఏటా అక్టోబర్ 15న ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవాన్ని పాటిస్తున్నామన్నారు. పరిశుభ్రత పాటిస్తే ఎన్నో వ్యాధుల నుంచి మనల్ని మనం కాపాడుకోవచ్చన్నారు. అపరిశుభ్రంగా ఉన్న చేతులతో ఆహారం భుజిస్తే హానికార బ్యాక్టీరియాలు నోటి ద్వారా శరీరంలోకి ప్రవేశించి వ్యాధులకు గురిచేస్తాయన్నారు. ఆహారం తీసుకునే ముందు, మలమూత్ర విసర్జన అనంతరం చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సర్రా జగదీష్, సర్పంచ్ వల్లూరి పద్మ, ఎంపీటీసీ సభ్యురాలు యలసిరి సత్యవాణి, కుందం హనుమారెడ్డి, కార్యదర్శి స్వర్ణకుమార్, ఆశా వర్కర్లు, ఏఎన్‌ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆలోచనా విధానం వర్ధిల్లాలి

- ఈ నినాదంతో రాష్ట్రంలో నాలుగు ప్రాంతీయ సదస్సులు
- సామాజిక న్యాయ బస్సు యాత్రకు ముందే నిర్వహణ
- ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి వెల్లడి



జూపూడిని సత్కరిస్తున్న ఎస్సీ సంఘాల నాయకులు

పొదిలి: 'జగనన్న ఆలోచనా విధానం వర్ధిల్లాలి' అనే నినాదంతో, సామాజిక న్యాయ బస్సు యాత్ర కంటే ముందుగా రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో ప్రాంతీయ సదస్సులు నిర్వహించనున్నట్లు రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు వెల్లడించారు. ఆదివారం రాత్రి కర్నూలు వెళ్తున్న ఆయన పొదిలిలోని నైస్ టీ హౌస్‌లో ఎస్సీ సంఘాలు, అనుబంధ విభాగాల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతి కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2.37 లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసిందన్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన 76 ఏళ్లలో ఏపీలో ఇదే అత్యుత్తమైన పాలనగా అభివర్ణించారు. ప్రధానంగా డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఊహించినటువంటి మహిళా సాధికారత జగనన్న పాలనలో సాధ్యమైందన్నారు. సంక్షేమ పథకాల అమలుపై దళితులను చైతన్యవంతులను చేసే బాధ్యతను ఎస్సీ సెల్ తీసుకుంటుందన్నారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నా 99 శాతం హామీలను నెరవేర్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికి దక్కిందన్నారు.

17 నుంచి ప్రాంతీయ సదస్సులు

రాష్ట్రంలోని నాలుగు ప్రాంతాల్లో ఈనెల 17వ తేదీ నుంచి ప్రాంతీయ సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు. 17న రాయలసీమ ప్రాంతీయ సదస్సు కర్నూలులో, 18న ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు పూర్వ జిల్లాల సదస్సు నెల్లూరులో, 21న శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ జిల్లాల సదస్సును విజయనగరంలో, 22న కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి పూర్వ జిల్లాల సదస్సు ఏలూరులో నిర్వహించనున్నట్లు వివరించారు. పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు, రీజినల్ కోఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ముందుగా జూపూడికి ఎస్సీ నాయకులు ఘన స్వాగతం పలికారు. సమావేశంలో ధర్నాసి పెద్దన్న, న్యాయవాది ధర్నాసి రామారావు, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి అశోక్, కేవీ నారాయణ, నగర పంచాయతీ ఎస్సీసెల్ అధ్యక్షుడు మల్లావురం నరసింహులు, కామునూరి వెంకటరావు, చెన్నయ్య, మొలకా పెద చెన్నయ్య, చింతగుంట్ల వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- మార్కాపురంలో రెండు జిల్లాల స్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్



టాస్ వేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురం: క్రీడల్లో గెలుపోటములను సమానంగా స్వీకరించాలని ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి సూచించారు. శనివారం రాత్రి, ఆదివారం ఉదయం స్థానిక డాక్టర్ వైఎస్సార్ క్రీడా వికాస ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్స్ అండ్ యోగా క్లబ్ అసోసియేషన్ ద్వారా ఓల్డ్ ప్రకాశం, ఓల్డ్ గుంటూరు జిల్లాల స్థాయిలో బ్యాడ్మింటన్ టోర్నమెంట్ నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాల మురళీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దసరా పండుగను పురస్కరించుకుని రెండు జిల్లాల స్థాయిలో పోటీలను ఏర్పాటు చేసిన భీమవరం వెంకటేశ్వరరెడ్డిని అభినందించారు. ఎమ్మెల్యే స్వయంగా బ్యాడ్మింటన్ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. రెండు జిల్లాల నుంచి మొత్తం 60 టీములు పాల్గొన్నాయి. ప్రథమ బహుమతి చెన్నైకి చెందిన అన్విక్ వికాస్ టీమ్, ద్వితీయ బహుమతి మునీర్, కిరణ్ టీమ్, తృతీయ బహుమతి రమేష్ టీమ్, నాలుగో బహుమతి మణి, కాశీ టీమ్‌లు కైవసం చేసుకున్నాయి. విజేతలకు డి. వెంకటేశ్వరరెడ్డి, అమీర్‌బాషా, సయ్యద్ దాదా పీరా, జీఎస్ మనోజ్ బహుమతులు అందించారు. విశిష్ట అతిథులు జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, న్యాయవాది భూవని కాశయ్య, స్నేహ నాట్య అకాడమీ ప్రిన్సిపాల్ పువ్వాడ ప్రతిమను సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్, కౌన్సిలర్ బుస్సెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు బాల్య వివాహాల నియంత్రణ దినం

ఒంగోలు టౌన్: బాల్య వివాహాల నియంత్రణ దినాన్ని పురస్కరించుకుని సోమవారం స్వయం సహాయక సంఘాల సభ్యులతో జిల్లా వ్యాప్తంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ తేళ్ల రవికుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రాన్ని బాల్య వివాహ రహితంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతి గ్రామంలో, మండల కేంద్రాల్లో బాల్య వివాహ నియంత్రణకు సంబంధించిన ప్రతిజ్ఞ చేయించనున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రమైన ఒంగోలులో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు కలెక్టరేట్ నుంచి రామ్‌నగర్ 1వ లైను వరకు మహిళలతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్లు, ఏపీఎంలు, సీసీలు, గ్రామ, మండల స్థాయి స్వయం సహాయక గ్రూపు సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



చికిత్స పొందుతున్న శ్రావ్యను కాపాడాలని వేడుకుంటున్న తల్లిదండ్రులు

పసిపాపకు పెద్ద కష్టం

- న్యూరోలాజికల్ డిజార్డర్‌తో పోరాటం
- వైద్యానికి రూ.15 లక్షలు అవసరం
- బతికించండంటూ తల్లిదండ్రుల ఆవేదన



శ్రావ్య (ఫైల్ ఫోటో)

ఉలవపాడు: మండలంలోని కరేడు పంచాయతీ కొత్తపల్లెపాలేనికి చెందిన మాకా సురేష్, భవానీ దంపతులకు ఏడాది వయసున్న శ్రావ్య అనే కుమార్తె ఉంది. పుట్టినప్పటి నుంచి ఆరోగ్యంగానే ఉన్న ఈ బాలిక ఇటీవల అనారోగ్యానికి గురవడంతో వైద్యశాలలో చూపించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు.. న్యూరోలాజికల్ డిజార్డర్ ఉందని తేల్చారు. తొలుత ఒంగోలులోని పిల్లల వైద్యశాలలో వైద్యం చేయించారు. అక్కడ తగ్గకపోవడంతో విజయవాడలోని రెయిన్‌బో చిన్నపిల్లల వైద్యశాలలో అన్ని రకాల పరీక్షలు నిర్వహించారు. అక్కడే పీఐసీయూ కేర్‌లో ప్రస్తుతం శ్రావ్య చికిత్స పొందుతోంది. ఈ వ్యాధి నయం కావడానికి సుమారు రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. ఆ మేరకు స్థానికంగా ఉన్న పెద్దలకు తల్లిదండ్రులు తెలియజేశారు. వారు కొంత సాయం చేశారు. ఇప్పటి వరకు దాతలు అందించిన దాంతో పాటు వారి వద్ద ఉన్న నగదు కలిపి దాదాపు రూ.3 లక్షలు వెచ్చించారు. ఆపై డబ్బు అందక చికిత్స చేయించలేకపోయారు. ప్రస్తుతం వైద్యశాలలోనే శ్రావ్యను ఉంచారు. న్యూరోలాజికల్ డిజార్డర్ బ్రెయిన్ ట్యూమర్‌గా మారుతుందని వైద్యులు తెలిపారని, దాతలు స్పందించి తమ బిడ్డను ఎలాగైనా బతికించాలని తల్లిదండ్రులు సురేష్, భవాని కోరుతున్నారు. సురేష్ బేల్దారి పనిచేసుకుంటూ జీవిస్తుంటాడు. బంధువుల వద్ద కొంత డబ్బు తెచ్చి వైద్యం చేయించాడు. పూర్తిస్థాయిలో చికిత్స చేయాలంటే దాదాపు రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. దాతలు స్పందించి ఆర్థికసాయం చేసి తమ బిడ్డను బతికించాలంటూ తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. ఆర్థికసాయం చేయాలనుకున్న వారు పాప తండ్రి సురేష్ ఫోన్ పే నంబర్ 9059778172కు పంపాలని కోరుతున్నారు.

ఆన్‌లైన్ మోసంపై ఫిర్యాదు

- రూ.2.75 లక్షలు కోల్పోయిన బాధితుడు
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మార్కాపురం: ఆన్‌లైన్‌లో వచ్చిన మెసేజ్ చూసి నగదు మోసపోయినట్లు మార్కాపురం పట్టణంలోని పదో వార్డుకు చెందిన సుభాన్ ఆదివారం సాయంత్రం పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్న సుభాన్ సెల్ ఫోనుకు ఇటీవల ఓ మెసేజ్ వచ్చింది. టాస్క్ పూర్తి చేస్తే రూ.2 వేల నుంచి రూ.10 వేల వరకూ ఆదాయం వస్తుందని అందులో పేర్కొన్నారు. వారు పంపిన లింక్ ద్వారా సుమారు రూ.2.75 లక్షల రూపాయలు సుభాన్ పంపాడు. ఈ క్రమంలో తాను మోసపోయానని గ్రహించి వారిని సంప్రదించగా ఇంకా రూ.3.95 లక్షలు పంపాలని డిమాండ్ చేశారు. లేదంటే ఇప్పటి వరకు చెల్లించిన డబ్బు తిరిగిరావని సమాధానమిచ్చారు. ఈ మోసంపై ఇటీవల ఒంగోలులో ఎస్పీ స్పందనకు వెళ్లి ఫిర్యాదు చేశాడు. విచారణ చేయాలని పట్టణ పోలీసు స్టేషన్‌కు సమాచారం రావడంతో సుభాన్ ఆదివారం రాత్రి పోలీసు స్టేషన్‌కు వచ్చి జరిగిన మోసాన్ని పోలీసులకు వివరించాడు. పట్టణ ఎస్సై కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ఆన్‌లైన్ మోసంపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.